వికారాలూ మమకారాలూ

మధురాంతకం రాజారాం

'తల్లి పుట్టినిల్లు మేనమామకు తెలియదా' అన్న లోకోక్తి ఒకటి వుంది. నిజమే! ఎందుకు తెలియదు? తెలియదని వనిగట్టుకుని చెప్పినా నమ్మేవాళ్ళెవరున్నారు? కానీ ఏమాటకామాటే చెప్పుకోడం మంచిది—ఆ వూరికి ఈ ఊరు ఎంత దూరమో, ఈ వూరికి ఆ ఊరూ అంతేదూరం గనుక తల్లి పుట్టినిల్లు మేనమామకు తెలిసినప్పుడు మేనమామ పుట్టినిల్లు తల్లికి మాత్రం తెలియకపోతుందా? తల్లికి తెలిసిన తర్వాత అదంతటితో ఆగిపోతుందని పూచీ ఏముంది? ఆమెద్వారా సంతానానికి గూడా తేటతెల్లం గాకపోతుందా?—అందులోనూ నా విషయంలో ఒక్క తల్లికి మాత్రమేగాక అటు వెనుకటితరంలో మా నాన్నమ్మకు, ఇటు ఈ తరంలో మా ఆవిడకూ కూడా అదే పుట్టినిల్లూ, ఇదే మెట్టినిల్లూ కావడంచేత మా మామయ్యగారి కుటుంబాన్ని గురించి నాకు తెలియని విషయమంటూ ఒకటీ వుండకపోవడంలో ఆశ్చర్యానికి ఆస్కారంలేదు. వరుసగా మూడుతరాలు ఇచ్చి తీసుకుంటే మూడు యజ్ఞాలు చేసినంత పుణ్యమని చెబుతారు. పుణ్యం సంగతి నాకు తెలియదుగానీ, ఇందుమూలంగా మా ఇంట్లో అత్తాకోడళ్ళ మధ్య పొరపొచ్చాలు తక్కువని మాత్రం ఒప్పుకోక తప్పదు. అలాగని మా నాన్నమ్మ మా అమ్మనీ, మా అమ్మ మా ఆవిడనీ సాధించరనీ, నాలుగు మాటలు విసిరి, ఒక్కదులుపు దులిపి మూతి బిగించరనీ అపోహ పడగూడదు! వాళ్ళల్లో వాళ్ళకు వెయ్యి విభేదాభిప్రాయాలున్నమాట నిజమే! కానీ ఒక్కవిషయంలో వాళ్ళది ఏకాభిప్రాయం. పుట్టింటిని గురించిన ప్రసక్తి గాలివాటుగా వచ్చి చెవిలో బడినాసరే వాళ్ళు ఏకోన్ముఖంగా లేచేస్తారు. తమ పుట్టింటిపైన ఈగ వ్రాలడానికి వీల్లేదంటే లేదంటారు!

బంధుత్వమేగాక మామయ్యగారి వూరికీ మా వూరికీ మధ్య దూరంగూడా తక్కువే. నాలుగణాలు మనవి కావనుకుంటే పదిహేను నిమిషాల బస్సుప్రయాణం. అక్కడ వాళ్ళు పొయిమీద పెనంపెట్టి కబురు పంపితే మనం వెళ్ళి దిగేసరికి వేడివేడి గారెలు తయారై వుంటాయన్నమాట!

ఈ సమీప సంబంధబాంధవ్యాల్ని పురస్కరించుకుని మా మామయ్యగారి కుటుంబవృత్తాంతాలు ఆధారంగా ఓ కథ వ్రాయాలన్న కోరికైతే చాలాకాలంగా వుంది. కానీ ఏవేవో సంఘటనలు కలగాపులగంగా స్ఫురిస్తాయిగానీ, వాటితో కథ గట్టడానికి వీలయిందిగాదు. ఎలాగైతేనేం, యిన్నాళ్ళకు మా చిన్నమామయ్యగారి కుమార్తె చి॥ సౌ॥ కుం॥ రాజేశ్వరి పుణ్యమా అని కథ కన్నులకు గట్టింది!

కాళ్ళు గడిగి కన్యాదాన మిచ్చారుగదా అని నాకు మా పెద్దమామయ్యగారిపట్ల పక్షపాతమనుకోకపోతే యిక్కడోమాట చెప్పాలి. మా చిన్నమామయ్యని గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. పెద్దమామయ్యా, చిన్నమామయ్యా ఒకే తల్లి బిడ్డలని మాత్రం ఖచ్చితంగా తెలుసు. లేదంటే ఒక కడుపులో పుట్టినవాళ్ళు సైతం ఉత్తర, దక్షిణ ధ్రువాల్లా ప్రవర్తించవచ్చుననిగూడా రూఢిగా తెలుసు.

ఓకు ఓడని కుండంతా ఓడనగూడదు. ఆదిలో మా చిన్నమామయ్య చాలా మంచివాడు. ముక్తసరిగా చెప్పాలంటే డాక్టర్ జెకిల్‌లాంటి మనిషి. కానీ ఏంచేద్దాం! విధివిధానం తప్పించరానిది గదా! కాలప్రభావాన మా చిన్నమామయ్య మిస్టర్ హైడ్‌లా తయారై కూచున్నాడు.

ఈ పరిణామానికి కారణాలూ వున్నాయి. కారకులూ వున్నారు. కారణాల్లో ముఖ్యమైంది ఉన్నతోద్యోగం. కారకుల్లో ముఖ్యురాలు మా సుందరమ్మత్త!

కానీ యిక్కడ కొంసేపాగి ఆత్మపరిశీలన చేసుకోడం అవసరమేమోనన్న అనుమానం సైతం నాకు లేకపోలేదు. రంగుటద్దాలకు లోకమంతా రంగుగానే కనిపిస్తుంది కానీ రంగున్నది అద్దాల్లోనేగానీ, లోకంలోగాదు. మా చిన్నమామయ్యగారి ఉద్యోగప్రాభవం, సిరిసంపదలూ మా స్వార్థానికి వుపకరించలేదన్న అక్కస్సులో—నాకు సుందరమ్మత్తపట్ల యిలాటి దురభిప్రాయం కలిగిందేమో! కావచ్చుననుకోడానికి అవకాశమున్నమాట వాస్తవమే! కానీ బొత్తిగా ఈ కలియుగంలో—ఎముకలువిరిచి, అష్టకష్టాలుపడి చదివిస్తే పట్టా చేతికి వచ్చి ఉద్యోగం దొరకగానే పట్టపుటేనుగ నెక్కినట్టు సంబరపడి కుమారుడు తల్లిదండ్రులనే విస్మరించే ఈరోజుల్లో మేనరక్త సంబంధాన్ని ఆసరాగా వుంచుకుని మా చిన్నమామయ్యనుంచీ ఆశించగలిగిందేముంటుంది చెప్పండి! లేదంటే ఆడబిడ్డలకు పుట్టింటిపట్ల మమకారం త్రెంపినా తెగదు గనుక వాళ్ళు ఏడాదికో చీర, యింత పసుపూ కుంకుమా ఆశించేమాట నిజమే! ఐతే మాత్రం? ఆచీరకూ, పసుపుకుంకుమకూ పదిరెట్లెక్కువగా ప్రచారం చేసిపెట్టి తమ పుట్టింటి ఘనతను అందలంలోపెట్టి ఊరేగించేది వాళ్ళేగదా! బుద్ధి సూక్ష్మతకు కాణాచి అయిన మా సుందరమ్మత్త యింత చిన్న విషయాన్నిగురించి ఆలోచించకపోవడం విచారకరం! ఆమె దాసీ పన్నా రాకుమారుణ్ణి తీసుకెళ్ళిపోయినట్టు మా చిన్నమామయ్యను మానుంచి దూరంగా తీసుకెళ్ళిపోయింది. ఆ తరువాత ఆయన మాకు ఏ ఒకటి రెండుసార్లుమాత్రమే కనిపించాడు. కానీ అదేం కనిపించడం! అల్లావుద్దీనుకు పద్మిని అద్దంలో అలా కనిపించి, అంతలో మాయమైవుంటుంది!

మా చిన్నమామయ్య అలా తెరవెనక్కు వెళ్ళిపోయి పది హేనేళ్ళయింది. ఈ ఒకటిన్నర దశాబ్దాల్లో ఆయన సువిశాల ఆంధ్రప్రదేశంలో ఎప్పుడెప్పుడు ఏయే వూళ్ళలో నివసించారో మాకు తెలియదు. ఒకసారి పెద్దమామయ్యగారికి చిన్న మామయ్యతో అత్యవసరంగా ఓ పని పడింది. ఈయన 'లోను' కోసం అప్లయిచేశారు. వాళ్ళ తమ్ముడి సంతకంలేనిదే అప్పివ్వడం సాధ్యంకాదన్నారు. ఏ వ్రేళ్ళతోనైతే పలక మీద ఓనామాలు దిద్దబెట్టించారో, ఆ వ్రేళ్ళతో మా పెద్దమామయ్యగారికి ఓ చేవ్రాలు కావలసి వచ్చింది.

ఈయన చిన్న మామయ్యగారి డిపారుమెంటులో తనకు తెలిసినవాళ్ళకందరికీ వుత్తరాలు వ్రాశారు.

అసలు మా చిన్నమామయ్య వుద్యోగంలో చేరింది అనంతపురంలో! అక్కడినుంచీ కడపకు ట్రాన్స్ఫరు వచ్చింది. కడపనుంచి ఆయన గూడూరుద్వారా కుటుంబసమేతంగా సామానులన్నింటినీ పాక్ చేయించుకుని గుంటూరికి వెళ్తూ రైల్లో కనబడినట్లు ఓ మిత్రుడిద్వారా వర్తమానం తెలిసింది. పెద్దమామయ్య గుంటూరికి ఉత్తరంవ్రాసి చూచారు. ఆ వుత్తరం గుంటూరునుంచీ విజయవాడ, ఏలూరు, విశాఖ అలా అలా ఉత్తరాంధ్రదేశమంతా ఓ చుట్టువేసుకుని కడకు సురక్షితంగా ఫ్రమ్ అడ్రసుకే వచ్చి చేరింది.

అప్పట్లో కొందరు పెద్దమనుషులు 'తప్పిపోయినాడు' అన్న శీర్షిక క్రింద పత్రికల్లో ఓ ప్రకటన వేయించగూడదా అని సలహా గూడా యిచ్చారు.

కానీ మా పెద్దమామయ్యగారివన్నీ భగీరథ ప్రయత్నాలు. ఆయన అంత సులభంగా ఆశ వదిలిపెట్టే రకంగాదు. చివరికాయన రాష్ట్ర ముఖ్యపట్టణానికే జాబువ్రాసి డెడ్ లెటర్ ఆఫీసులో చిరునామాను పోల్చుకున్నట్టుగా చిన్నమామయ్య ఆచూకీ కనిపెట్టేశారు.

అప్పుడు మా చిన్న మామయ్య ఆదోనిలో వున్నాడు.

ఆదెబ్బతో మా పెద్ద మామయ్యకు కన్నడాంధ్ర సంస్కృతులకు సంగమ క్షేత్రాలయిన ఆదోని, బళ్ళారిలాంటి పట్టణాల్ని సందర్శించే భాగ్యం కలిగింది.

అప్పటికీ మా పెద్ద మామయ్యే నయం! నా సంగతి చెప్పుకోవడం నామట్టుకు నాకే సిగ్గుబాటుగా వుంటుంది. ఒకసారి నేను మా చిన్న మామయ్యను చూచిరావడానికని బయల్దేరి, భూమి గుండ్రంగానే వుందన్న పరమసత్యాన్ని ఋజువు చేసుకున్నాను.

వాకబుచేయగా తెలిసింది చిన్నమామయ్య నెల్లూరుజిల్లా కనిగిరిసీమలో వున్నాడని!

అర్ధరాత్రప్పుడు గూడూరులో రైలెక్కాను. హేమంత నిశీధం. రెండుగంటలూ, ఆ ప్రాంతంలో మంచుదుప్పటి కప్పుకుని పెన్నానదీతీరంలో నిద్రపోతూ కనిపించింది నెల్లూరు. 'చిన్నమామయ్య ఈ పట్టణంలో వుంటే ఎంత బాగుండేది! హాయిగా

★ పితరాలూ, మమకారాలూ ★

ఇక్కడ దిగేసి బంధుదర్శనంతోబాటు రంగనాథుణ్ణికూడా దర్శించుకోడానికి వీలయ్యేదిగదా' అని విచారించాను.

కానీ అంతలోనే మళ్ళీ ఒకఊహ. రంగనాథునికేం తొందర? ఆయన శతాబ్దాల నుంచీ యిక్కడే వున్నాడు. ఇకపైనా యిక్కడే వుంటాడు. మా చిన్నమామయ్య సంగతి అలా కాదే!

తొలికోడి కూయకముందే సింగరాయకొండలో ఆగింది రైలు. మంచు దట్టంగా కురుస్తోంది. చీకట్లో యింతకుమునుపెన్నడూ కాలుపెట్టి ఎరుగని ఆ వూళ్ళో బస్టాండు వెదికి పట్టేసరికి కాళ్ళూ చేతులూ కొంకర్లు పోయినంత పనైంది.

సరే, బస్సు తెల్లవారకముందే కదిలింది. సరిగ్గా మధ్యాహ్నం పదకొండు గంటలకు కనిగిరి!

అన్వేషణ సాగించాను ఆఫీసుకోసం. ఆఫీసేమో కనిపించింది. "అయ్యోనాయనా! ఇంతదూర మొచ్చేశావా? మీ మావయ్య నెల్లూరికి ట్రాన్స్ఫరై నెలరోజులైందే! ఐనా యిప్పుడేం మించిపోయిందిలే! హోటల్లో భోజనంచేసి బస్సులో కూచో. సరిగ్గా సాయంత్రం ఆరున్నరకు నెల్లూరు" అన్నాడు మా చిన్న మామయ్య స్థానంలో పనిచేస్తున్న ఆఫీసరు.

ఇంత పనిచేశావా భగవంతుడా అనుకుంటూ ఒంటి గంటకు కనిగిరి—నెల్లూరు బస్సులో కూచున్నాను.

మరపురానిది ఆ ప్రయాణానుభవం.

రెండుమూడు బారలకన్నా పొడవు లేని ఆ చిన్న బస్సు మట్టిబాటలో పరుగెడుతుంటే చెక్కలకు చెక్కలుగా, కమ్ములకు కమ్ములుగా ముక్కలు ముక్కలై నుగ్గునూచమై గాలికెగిరిపోతుందేమోనని తోచింది. నిజానికి పెన్న దాటుతునేదాకా నమ్మకం లేకపోయింది, పెరుమాళ్ళను గానీ, చిన్నమామయ్యను గానీ చూడగలనని!

"ఇదేనా రావడం! ఊళ్ళో అందరూ బాగున్నారుకదూ? కాఫీతీసుకొస్తానుండు" అంటూ సుందరమ్మత్త లోపలికి వెళ్ళింది.

అడిగిన ప్రశ్నలకు నేను జవాబివ్వకముందే లోపలికి వెళ్ళిపోతున్న సుందరమ్మత్తను చూస్తూ విస్తుపోయాను.

ఇది జవాబుకోసం గాకుండా కేవలం మర్యాదకోసం చేసిన పరామర్శ కాబోలు!

ఇంతలో ఎలా వెళ్ళిన సుందరమ్మత్త అలాగే వట్టి చేతులతో తిరిగొచ్చేసరికి ఈ కాఫీ మర్యాద కూడా లాంఛనప్రాయమేనేమోనని నేను బిక్కచచ్చిపోయాను.

"ఈ వంటలక్కలతో వచ్చిన చిక్కే యిది! సమయానికి అయిపు లేకుండా పోతుంది. నువ్వలా గదిలో రేడియో వింటూ కూచో బాబూ! నేను చలమయ్యను హోటలుకు పంపిస్తాను" అంటూ ఈసారి సుందరమ్మత్త వరాండావైపు వెళ్ళిపోయింది.

వాకిటనే పదిలంగా చలమయ్య అనే బంట్రోతు వున్నాడనీ, ఇంట్లో వంటలక్క అమరివున్నదనీ, రేడియో మూలంగా శ్రీకాంతోపరులేననీ చెప్పకనే చెబుతోందేమిటిమా సుందరమ్మత్త?

గదిలో కూచున్నాను. రేడియోలో సన్నగా వినవస్తున్న పాటను మినహాయిస్తే యిల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఇంట్లో ఇద్దరు పిల్లలుండాలి. (ఇది పదేళ్ళక్రిందటి మాట. ఇప్పుడు సంఖ్య త్రిగుణీకృతంకావస్తున్నట్టు తాజావార్త) వాళ్ళ సవ్వడి ఏ మూలనుంచి గానీ వినరావడంలేదు. ఇదేమిటబ్బా, రాత్రి ఎనిమిదిగంటలప్పుడు వీళ్ళేమైనట్టు?

ఆ పిల్లకు నూరేళ్ళాయుస్సు, తలచుకుంటూ వుండగానే ప్రత్యక్షమయింది అయిదేళ్ళ రాజేశ్వరి.

గదిలోకి వస్తూ వస్తూ నన్నుచూచి ఆగిపోయింది రాజేశ్వరి. ఆ పిల్లకు నేనెవరినో లీలగా తెలుసు.

"గుర్తు తెలియడంలేదా రాజేశ్వరీ! పోనీ దగ్గరికి వచ్చి చూడు" అంటూ చేతులు ముందుకు చాపాను.

రాజేశ్వరి తుర్రున బయటికి పారిపోయింది.

పారిపోయిన రాజేశ్వరి నా ఆగమనాన్ని గురించి తమ్ముడితో చెప్పిందేమో, అందుకు తోడూ ఆ యింటికి బంధువు అన్నవాడి ఆగమనం అత్తిప్రాతలా విపరీతం కూడానేమో, మూడేళ్ళ విజయ్ కుతూహలంతో పరుగునా వచ్చేశాడు.

వచ్చినవాడు అది వాడి గ్రహచారమో, కాక నేనాయింట్లో ప్రవేశించిన వేళావిశేషమో ద్వారబంధానికి పాదం మోదుకుని అడుగు తడబడి బోర్లగిల బడిపోయి ఏడుపు లంకించుకున్నాడు.

గబగబా వెళ్ళి కుర్రాణ్ణి పైకి లేవదీశాను. "దెబ్బ తగిలిందా బాబూ! ఎక్కడ తగిలింది? పోనీలే. పోతుందిలే" అంటూ వూరడిస్తున్నాను.

"ఏం జరిగింది రాజేశ్వరీ? ఎందుకు పడిపోయాడు? నువ్వు తోసేశావేమిటి?"

అంటూ అక్కడ సాక్షాత్కరించింది సుందరమ్మత్త.

"లేదత్తయ్యా! తొందరగా వస్తున్నాలే కదా! కాలుతగిలి పడిపోయాడు" అన్నాను.

"అట్నే, అదే! ఎందుకు రావాలి తొందరగా! ఇక్కడేం రాచకార్యాలున్నాయని? కాదులే. ఇలాకాదు..." అంటూ ఆవిడ కుర్రాడి రెక్క పట్టుకుని బరబరా హాలు మధ్యకు లాక్కెళ్ళింది.

తను కుర్చీలో కూచుంది. కుర్రాణ్ణి ఎదుట నిల్చోబెట్టింది.. "చెప్పు, ఎందుకు పరుగెత్తావు తొందరగా?" అని వీలైనంత కటువుగా ప్రశ్నించింది.

నేను తెల్లబోయాను. కుర్రాడు పరుగెత్తకుండా వుండాలంటే ఒకటే — వాడికేదో జబ్బయినా వచ్చివుండాలి, లేదా కుంటివాడైనా అయివుండాలి. ఈ రెండూ లేనప్పుడు వాడు కాళ్ళు కట్టి పడేస్తే తప్ప పరుగుతీయకుండా వుండడు. ఇక పడిపోవడమంటేనా, మహా మహా పెద్దవాళ్ళే ఒక్కొక్కప్పుడు నడిరోడ్డులో పల్టీ కొట్టేస్తారు. వ్రేలెడంత పసివాడు అడుగుజారి పడిపోవడమూ నేరమేనా?

గొంతెత్తి ఏడవడానికి ధైర్యంచాలక, ఏడుపు బిగబట్టుకోవడంవల్ల మాటలు పెకలక గడగడలాడి పోతున్నాడు విజయ్‌బాబు!

హఠాత్తుగా దగ్గిరికి లాక్కొని సుందరమ్మత్త వాడి నడినెత్తిన నాలుగు వడ్డించింది. "చెప్పు. ఇంక తొందరగా పరుగెత్తవు కదూ! బుద్ధొచ్చింది గదూ? పరుగెత్తవు కదూ!"

"బుద్ధొచ్చింది. ఇంక పరుగెత్తను" అంటూ విజయ్ చెంపలు వేసుకున్నాడు. వేసుకుంటేనేం గాక! ఆమాత్రంతో, సుందరమ్మత్త కోపం శాంతించింది. అదే పదివేలు!

"కూచో. నేను చెప్పేంతవరకూ అక్కడే కూచో" అని, పిండిబొమ్మను చేసిపెట్టి స్నానానికి వెళ్ళిపోయిన దాక్షాయణిలా ఆవిడ మళ్లీ యింట్లోకి వెళ్ళిపోయింది.

తొమ్మిది గంటలకు యిల్లు చేరుకున్న చిన్న మామయ్య లేవమన్నప్పటికీ ఆ కుర్రకుంక కదిలీ మెదిలాడు గాదు! మేమిద్దరమూ భోజనంచేసి తిరిగివచ్చేసరికి నిద్ర ముంచుకొచ్చేసిందేమో వాడక్కడే పడి నిద్రపోతున్నాడు!

"అయ్యో పాపం! విజయ్‌బాబు!" అని అనుకోకుండా వుండలేక పోయాను.

కానీ నేనక్కడున్న నాలుగురోజుల్లో ఈ చిన్న విజయ్‌బాబు నిర్మాణదశలో వున్న ఒక చిన్నశిల్పం మాత్రమే కనీ, ముంతకంటే పెద్దశిల్పం ఎన్నడో తయారై పోయిందనీ తెలుసుకోగలిగాను.

అవును మరి! అలావుంది పరిస్థితి. అనవసరంగా మాట్లాడగూడదన్న నిర్ణయానికి వచ్చినట్టున్నాడు చిన్న మామయ్య. సుందరమ్మత్త "స్నానానికి లేస్తారా" అంటుంది. ఈయన స్నానాలగదిలోకి వెళ్తాడు. "భోజనానికొస్తారా" అంటుంది. పీటమైన కూచుంటాడు. "ఆఫీసుకు టైమయింది" అంటుంది. ఈయన పైకి లేస్తాడు. ఆమె ట్రంకు తెరిచి పాంటు, బుష్‌కోటు పైకి తీస్తుంది. గుండీలు వేయడం, మేజోళ్ళు తొడగడం, క్రాపు దువ్వడం లాంటి ఫినిషింగ్ టచెస్ గూడా సుందరమ్మత్త చేతిమీదుగా జరిగిపోతాయి. చిన్న మామయ్య ఆఫీసుకు వెళ్ళిపోతాడు... ఇలా దొర్లి పోతున్నాయి రోజులు.

జీవితం చిరుతరగలతో తెలినురగలతో పడుతూ లేస్తూ సాగిపోయే సెలయేరులాంటిదంటారు. అలాంటి జీవితం టిక్కుటిక్కుమనే గోడ గడియారంలా పరిణమించడాన్ని చూస్తే ఎవరికైనా బాధాకరంగానే వుంటుంది. బరువెక్కిన హృదయంతో నెల్లూరునుంచీ తిరిగి వచ్చేశాను.

ఇది పదేళ్ళక్రిందటి మాట.

నిన్న మొన్ననే జరిగినట్టున్నా ఇప్పుడు చెప్పబోతున్నది గూడా రెండు మూడేళ్ళ క్రిందటి సంగతి. 'వివాహ నిర్ణయాలు పైలోకంలోనే జరిగిపోతాయి' అంటూ ఆంగ్లంలో ఓ సామెతవుంది. పైలోకం దాకా మానవుడి స్పుట్నిక్ పరతెంచేవరకూ అక్కడ జరిగేదేమిటో, జరగందేమిటో మనకు తెలియదుగానీ మా పెద్దమామయ్య జ్యేష్ఠకుమారై వివాహంమాత్రం దాని పుటుకతోనే స్థిరీకరింపబడిపోయింది. అటు దానికీ, ఇటు నాకూ కూడా పెద్దలు ఆ అభిప్రాయాన్ని పాలల్లో రంగరించిపోశారు. అన్నం రాలాతో కలిపి నేర్పించారు. రక్తంతో కలిపి పోషించారు. ఇంతటితో ఏమయింది అన్నట్టు చిట్టచివరకు వాళ్ళూ వీళ్ళూ కూడా కూడబలుక్కొని ఓ మంచి ముహూర్తంలో డోళ్లు ధణధణా మ్రోగించి ఆ శుభకార్యం కాస్తా అయిందంటే అయిందనిపించడానికి గూడా సంసిద్ధులయ్యారు.

ఈ పెళ్ళి ఎలాగూ జరిగిపోయేదే!... కట్నాల పేచీలు, ఆడబడుచుల అలకలు, వియ్యపురాళ్ళ రాద్ధాంతాలు ఈపెళ్లికి అడ్డు తగిలే అవకాశం ఏమాత్రమూ లేదు. ఈ సంగతి అందరికీ తెలుసు. కానీ దీనితోబాటు తెలియని విషయం కూడా ఒకటుంది. ఈ పెళ్లికైనా చిన్నమామయ్య వస్తాడా రాడా అన్నదే ఆ తీరని ప్రశ్న!

ఎందుకు రాడు? అతడి తల ఇనుముతో చేసిందేమిటి? వరుడా అక్కచెల్లెలికొడుకు. వధువా అన్నదమ్ముడి కూతురు. దీనికే రాకపోతే యింక అతడు దేనికొచ్చేటట్టు? ఏం, తనుమాత్రం వట్టి ఇంట్లోవున్నాడా? తనకు బిడ్డలు లేరా? వాళ్లకు పెళ్లిళ్లూ, పేరంటాలు జరగొద్దా?. ఇలా సాగింది బంధువుల ఊహాగానం.

ఏమిటో మరి! వీళ్ళ వాదసారే వీళ్ళది! పాతబడిపోయిన ఈ సాంఘికాచారాలను పట్టుకుని దేవుళ్ళాడుతారేమిటి వీళ్లు! బంధువులతో ప్రసక్తి లేని లవ్ మేరేజస్ ఎన్ని జరిగిపోవడం లేదు!

అనుకున్నంత పనీ చేశాడు — చిన్నమామయ్య. పెళ్లికి హైదరాబాదునుంచీ మా బావగారొచ్చారు. మైసూరు ప్రాంతం నుంచీ మా పెద్ద మామయ్య స్నేహితులు సకుటుంబంగా తరలివచ్చారు. కానీ చిన్న

అన్ని కాలములలోను

ప్రతి దినము



సేవించండి.
దీనిని సోడా, చల్లని పాలుతో కలిపి తీసుకొనవచ్చును.

మీ ఆరోగ్యమును, జీర్ణశక్తిని, బలమును పెంచు రుచికరమైన పానీయము.

ఇండియా క్యానింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, విజయవాడ.

VKHN

★ ఏకారాలూ, మమకారాలూ ★

మామయ్య మాత్రం రాలేదు. కనీసం నా మట్టుకు నాకు ముహూర్త సమయానికి ఆయన దగ్గరనుంచీ ఓ కార్డుముక్కలో శుభాశీస్సులైనా అందలేదు.

పెళ్లి సందడి తగ్గిన పది రోజులకు ఓ వుత్తరము వచ్చింది. అందులో—పెళ్ళికి బయలేదేరి స్టేషను కు వచ్చినట్టూ, విజయ్‌బాబు కాలుజారి (మళ్ళీ!) ప్లాటుఫారంపైన పడిపోయినట్టు, వాడి ముక్కులో నుంచీ (ఈసారి!) బొళుక్కు బొళుక్కున రక్తం కారినట్టు, అంచేత యింటికి తిరిగి వెళ్ళిపోవలసివచ్చినట్టు—ఓ సంజాయిషీ గూడా దృగ్గోచరమైంది.

ఈ భారతదేశపు రైల్వేడిపార్టుమెంటు! ఎప్పుడూ మిగులు బడ్జెట్టే దీనికి! కుర్రాళ్ళు పడిపోవచ్చు, ముక్కులోనుంచీ రక్తం స్రవించవచ్చు. అందువల్ల యింటిల్లిపాదీ పెళ్ళికి పోలేకపోవచ్చు, అన్న ఆలోచన లేకుండా బండపలతోనా ప్లాటుఫారాలు! పోనీ, సముద్రతీరంలా పైన సన్నగా యిసుకైనా పోయించకూడదూ?

పెద్దమామయ్య ముఖం చిన్నబోయింది. చదివి ముగించిన తర్వాత వుత్తరం ఆయన చేతిలో నలిగి వుండగా మారిపోయింది. ఆయనదాన్ని వంటచేసుకుంటున్న అత్తయ్య ఒడిలోకి విసిరాడు.

"ఏమండీ! ఏమని వ్రాశారు?"

పెదమామయ్య ఆ కోపంలో "ఊఁ వ్రాశారు. కూరలో పప్పులేదని..." అని, అంతలో యిప్పుడు తప్పు జరిగింది అత్తయ్య వల్ల కాదని తెలియగానే కొస్తా శాంతించి "ఈ కుంక! పెళ్ళికి రాలేక పోవడానికి ఓ కారణాన్ని కల్పించడానికైనా చేతగాని ఈ బడుద్ధాయి! అప్పట్లో నాకొచ్చే పది హేనురూపాయల జీతంలో అయిదురూపాయలు మిగలబెట్టి వీడికి ఫీసు కట్టాను. కృతజ్ఞత? ఎక్స్‌ప్లనేషను వ్రాస్తున్నాడు. ఎవడికి కావాలి వీడి బోడి ఎక్స్‌ప్లనేషను?" అంటూ ఆగ్రహాన్ని చంద్రనిప్పులుగా మార్చి శూన్యంలోకి వెదజల్లారు.

"మీదొక పొడు! ఏనాడో మీరు చదివించారని ఈనాడు మీ యింట్లో పెళ్ళికి రావాలని అగ్రిమెంటేముందండీ? ఎంతగా అన్నాతమ్ముడూ అయితేమాత్రం అంతస్తులు లేవూ? మీకుకాబట్టి వాళ్ళు అమ్మాయి పెళ్లికి రాకపోబట్టి తెలిసింది. ఐదారేళ్ళకు మునుపు తిరుపతికి వెళ్తూ వెళ్తూ ఏనాడైతే యిక్కడ దిగారో ఆనాడే నాకంతా తెలిసి తెలిసిపోయింది."

"తెలిసిపోయిం దేమిటి నీ మొహమూ!" మామయ్యగారి కోపం ఆయస్కాంతపు దిక్సూచిలాంటిది. అది ఎప్పుడు, ఎక్కడ, ఏకారణంవల్ల వుప్పతిల్లినా చిట్టచివరకు అత్తయ్యపైకే ప్రసరిస్తుంది.

"బాత్ రూము ప్రత్యేకంగా లేదుగనుక తను స్నానం చేయడం సాధ్యంకాదని మీ మరదలు నిక్కచ్చిగా చెప్పేసింది. ఆపిల్ల-పేరు రాజేశ్వర నుకుంటాను. అది 'రేడియో లేకుంటే వీళ్లెంవింటా రబ్బా' అని విస్తుపోయింది. ఇక మీ తమ్ముడిగారి సంగతి సరే సరి! ఇంట్లో కూచుంటే ఈపిల్లలు పైనబడి ఆయన ఫాంటును కొస్తా నలిపేసి వూరుకుంటారు. బయట అరుగుపైన కూచోవడానికి నామోషీ! పాపం, మానవుడు అవస్థపడి పోయాడు. ఈమాత్రం భాగ్యానికి మీరు వాళ్లని మళ్ళీ మళ్ళీ రమ్మంటారు."

మామయ్యకు వూరడింపుగా ఇక్కడ నేను స్వయంగా కలుగజేసుకున్నాను.

"కానీ యిది స్వంత యిల్లవునా కాదా అత్తయ్యా! అద్దె యివ్వడానికి సమ్మతిస్తే మీరూ పెద్ద మిద్దెల్లో కాపురం పెట్టవచ్చు. ఆమాటకొస్తే హోటల్లో గది తీసుకోవడం యింకా హాయి! ప్రాచీన నాటకాల్లో రాజుగారు ఎవరక్కడ అనగానే ప్రతీహారి ప్రవేశించినట్టు కాలింగ్ బెల్ నొక్కగానే సర్వరు ప్రత్యక్షమౌతాడు" అన్నాను.

కానీ మామయ్య హాస్యాన్ని ఆస్వాదించే పరిస్థితిలోగానీ, 'అప్రీసియేట్' చేసే ధోరణిలోగానీ లేరు. ఆయన నగుమొ ఖానన రాలు ఉద్వృత్తగా లేచేశాయి. ఆలోచనలన్నీ అంతర్ముఖమై పోయి వాటిలో వాటికి సంఘర్షణ జరిగి, లోలోపల సముద్ర మథనం లాంటి తతంగం జరుగుతున్నట్టు తోచింది.

బహుశా మామగారిదో దృఢనిర్ణయానికే వచ్చినట్టున్నారనుకున్నాను. నిజమే! ఆయన పట్టుపట్టేశారు. ప్లాను వేసేశారు.

మూడు నెలల తర్వాత ఓ రోజున అత్తయ్యనాతో తన సొదనువెళ్ళబోసుకుంది. "ఏం చెప్పమంటావు నాయనా! మీ మామయ్య చిత్రంగా మారిపోయారు. ఆ థియేటరు వెనకవైపుకు వెళ్లి కూచుంటే ఆయనకు మళ్లీ యింటికిరావాలనే బుద్ధిపుట్టడంలేదు.

"ఇదేమిటత్తయ్యా! అంతగా సినిమా

(61 వ పేజీ చూడండి)

★ వికారాలూ, మమకారాలూ ★

[12-వ పేజీ తరువాయి]

చూడదలచుకుంటే థియేటరు లోపలికే వెళ్లిపోవచ్చుగదా! వెనుక వైపున ఈయన కేం పని?" అన్నాను.

"మాట్లాడితే 'ప్లాటు, ప్లాటు' అంటారు. మన మాట చెవిలో బడదు"

నాకాశ్చర్యం కలిగింది. మామయ్య అక్కడెక్కడైనా ఏకాంత ప్రదేశంలో కూచుని ఏకథకో, కావ్యానికో ప్లాటు అల్లుకుంటున్నారేమిటి?— అత్తయ్య ఎదుట ఈ సందేహాన్నే ప్రకటించాను.

"అయ్యో, అలాటి ప్లాటు కాదు బాబూ! ఇంటి కోసం ఆయన కొన్న జాగా సంగతి చెబుతున్నాను. నా పైను బ్యాంకులో వుంచి అయిదొందలు తెచ్చి పదిరోజుల క్రిందట ఓ ప్లాటు కొనేశారు. చుట్టూరా కట్టడాలు పైకి లేస్తుంటే తను ఆ ప్లాటులో కూచుని వాటివైపు వెర్రిగా చూస్తుంటారు."

వందరూపాయల జీతం తీసుకున్న ఉపాధ్యాయ మాత్రుడు భారీఎత్తున భవన నిర్మాణానికి పూనుకోడం లేని చిక్కుల్ని కొని తెచ్చుకోడమేనేమో ననిపించింది. కానీ నిశ్చితార్థాన్ని వదలని నిపుణత్వం మామగారిలో వుందన్న విషయం గూడా నాకు తెలియందిగాదు. కాబట్టే ఆయన ప్రస్తుతం కాపురముంటున్న యింటి గోడలు పాతబడి పుప్పి రాలిపోతుండగా కొత్త కట్టడానికి యిటుకలు కొనగలిగారు. మాసికల చీరతో అత్తయ్య ముఖాన్ని బయటికి చూపడానికి కించపడుతుండగా, పోస్టు బాక్సు ట్రౌజరులో కుర్రాడు బడికిపోతుండగా ఈయన కొత్తయింటికి దూలాలు వాసాలు కొన్నారు.

కానీ మామయ్య తొందరకు తగినట్టుగా ఆయన చేతిలో డబ్బు మెదిలేది గాదేమో! పని కాస్తా మందకొడిగానే కొనసాగింది. ఆయన పాలిటి కార్యక్రమం పంచవర్ష ప్రణాళికే అయిపోయింది. ఆకట్టడం హీరాకుడ్ ప్రాజెక్టే అయిపోయింది.

ఇంట్లో నిప్పచ్చరం సంగతిలావుండగా మానసికంగా మామయ్యలో వచ్చినమార్పుకు మేమందరమూ దిగ్భ్రాంత చేతస్కులమై పోవలసి వచ్చింది.

ఓ రోజు అత్తయ్య అంది గదా—"ఐనా యింత విపరీతమా బాబూ! ఆకులో అన్నం వడ్డించి, కట్టడం సంగతి ప్రస్తావిస్తే చాలు. ఇక ఆయనకు కూరా చారూ మజ్జిగ ఇవన్నీ అనవసరం. వట్టి అన్నం తినంతటదే దిగిపోతుంది."

దొరకవచ్చుననుకున్న అప్పు సమయానికి దొరక్కపోవడం, మేస్త్రీల వల్ల జరిగే జాప్యం, మార్కెట్టులో సిమెంటుకు లాటరీ -అంతెందుకూ, ఏ ఒక్క పరిస్థితీ గృహనిర్మాణానికి అనుకూలించని రోజులు. మామయ్య 'గోల్' చేయదలచుకున్న బాలుకు అడుగడుగునా అడ్డంకులే! సంపాదనకూ, జీవితావసరాలకూ బొటాబొటిగా సరిపెట్టుకోడంతో సతమతమైపోయే వ్యక్తికి అయిదు వేల రూపాయల కట్టడం కలలో తప్పాయిలలో సాధ్యమయ్యే పనిగాదు. ఐతేనేం, ఎక్కడైతే 'విల్' అనేది వుందో అక్కడ 'వే' గూడా వుండి తీరుతుందని మామయ్య బుజువుచేశారు.

ప్రాకారకుడ్యం దాటగానే చిన్న పూలతోట, సోపానా లెక్కగానే వరాండా, వరాండాకు కుడివైపున ఆఫీసు రూము. ఇంకా హాలు, వంటగదీ, పెరడు, చేదబావి, సమస్త సదుపాయాలతో చిన్న బంగళాలాంటి యిల్లు రూపొందింది.

"ఏమండీ మాష్టారూ! గృహప్రవేశం గూడా చేశేశారటగా! చూచిపోదామని వచ్చాను" అంటూ మేడల్లో నివసిస్తున్న వాళ్లతోబాటు, నివసించాలని కలగంటున్న వాళ్లు సైతం వచ్చి, క్రొత్తయింటిని చూచి, మామగారి పట్టుదలను ప్రశంసించి, అత్తయ్య చేతి కాఫీని స్వీకరించి వెళ్ళిపోసాగారు.

కానీ భూమిలో ఏడు నిలువుల లోతున కదిలే నీటివూటలా ఈ మహత్కార్యానికి అట్టడుగునవున్న కారణం అదోక తీరని ఆకాంక్షలా ఆ భార్యాభర్తల మనసుల్లో మెదిలేదేమో! కావచ్చు. ఇలాంటి విషయాల్లో ఆడవాళ్లు మరీ బేలతనంగా వ్యవహరించేస్తారు. "ఇల్లేమో కట్టేశారండీ! కానీ ఏం లాభం? మీ తమ్ముడు గృహప్రవేశానికి గూడా రాకపోయాడు" అని ఓ రోజు అత్తయ్య చెబుతుండగా విన్నాను.

"వాడొస్తే ఎంత! రాకపోతే ఎంత! ఆ దొర వచ్చి చూడాలనే నేమిటి నేనుకట్టింది యిల్లు! వాడు నా గుమ్మం తొక్కనూవద్దు—నేను వాడి ముఖం చూడనూవద్దు" అన్నారు మామయ్య.

మామయ్యకూ, అత్తయ్యకూ ఈ సంభాషణ జరిగిన తర్వాత మూడు మాసాలకు నేనొకసారి తలవని తలంపుగా అక్కడికి వెళ్లి రావలసి వచ్చింది. వీధిలో వుండగానే మామగారి మాటలు వినిపించాయి. ఆయన మహోత్సాహంతో గృహనిర్మాణ కథాకథనాన్ని కొనసాగిస్తున్నారు. "అబ్బబ్బ, ఇవేం గడ్డురోజులురా బాబూ! ఈ ఒక్క ఆలమారా తలుపుకే యాభైరూపాయలు కావలసి వచ్చాయంటే నువ్వు నమ్ముతావా? పోనీ, ఈ కిటికీ చూచావూ—కొయ్యలూ, కమ్ములూ, కూలీ వరకీ దీనికిమ్మత్తు సరిగ్గా వందరూపాయలు..."

నేను హాల్లో అడుగు పెట్టగానే ప్రసంగము ఆగిపోయింది.

నిట్టనిలువునా కొయ్యబారి పోయానేమో! నాలుగైదు క్షణాలు అలాగే నిల్చుండిపోయాను. శ్రోత మరొకరూ, మరొకరూ కాదు—సాక్షాత్తు మా చిన్నమామయ్య.

గొంతుకలో వెలక్కాయ పడ్డట్టుంది చిన్నమామయ్యకు! ఆయన పెదవులు కదిలాయిగానీ మాటలుమాత్రం వెలువడ్డాయి కావు.

మా ముగ్గురిలో ముందుగా తేరుకున్న మా పెద్ద మామయ్య "ఎప్పుడొచ్చావు నాయనా! ఊళ్లో అందరూ బాగున్నారు కదా?" అన్నారు.

ఉన్నారున్నారని ముక్తసరిగా జవాబు చెప్పి సరాసరి వంట గదిలోకి వెళ్లాను.

అత్తయ్య కాఫీయిస్తూ, "కూతురికి పెళ్ళి తలపెట్టుకున్నాడట బాబూ! పిలిచి పోదామని వచ్చాడు. ఏ ముఖం పెట్టుకునివచ్చావని మీ మామయ్య అడగలేక పోయారు. నువ్వయినా కుండ గొట్టినట్టు అడిగేయాలి" అంది.

"అడిగేం లాభం అత్తయ్యా! ఆముఖాన్ని చూస్తే తెలియడం లేదా? శుభ్రంగా తారుతో అలంకరించి నట్టుంది. మానవుడు ఒకప్పుడు బంధు ప్రేమనీ చంపుకోవచ్చు. మరొకప్పుడు అవసరం తనది గదా అనీ అభిమానాన్ని చంపుకోవచ్చు. కానీ మానవుడెప్పుడూ చంపుకోలేనిది ఒకటి వుంది. దాని పేరు అంతరాత్మ, అన్నాను.

ఆ రోజు సాయంత్రం చిన్నమామయ్య వెళ్లిపోయాడు. పోతూపోతూ "మీ చెల్లెల్ని గూడా పంపిస్తాను వదినా! మీరందరూ పది రోజులు ముందుగానే వచ్చేయాలి" అని మరీ మరీ చెప్పిపోయాడు.

"ఏమండీ! వెళ్లేటట్టే వుందే మీ పోజు!" అంది అత్తయ్య.

"ఏం! ఇతగాడొచ్చి పిలవగానే వెళ్ళాలేమిటి? వీడుగాదు, వీడి జేజినాయన దిగిరావాలి నేను వెళ్లడానికి" అన్నారు మామయ్య.

"వాళ్ల జేజినాయన దిగివస్తే మీ జేజినాయనా దిగివచ్చినట్టేగదా" అంది అత్తయ్య.

అవి దసరా సెలవులు. అలాగే ఒక స్నేహితుడి ఊరికి వెళ్లి నాలుగైదు రోజుల తర్వాత ఇంటికి తిరిగి వెళ్ళాను. ఎలా తెలిసిందోగానీ శుభవర్తమానం అప్పటికే మా వాళ్లకు తెలిసిపోయింది. వెళ్లగానే అడిగింది మా ఆవిడ—

"ఏమండీ! మాచిన్నాన్న వచ్చిపోయాడటగా! రాజేశ్వరికి పెళ్ళటనే! మన వాళ్ళు వెళ్ళాలనుకుంటున్నారేమిటి?"

"ఇంకా నిర్ణయానికి రాలేదనుకో! కాని మీ సుందరమ్మపిన్ని ఓసారి వచ్చి ప్రత్యేకంగా వున్న బాత్ రూమ్‌లో స్నానం

★ రాజధాని కబుర్లు ★

(5-వ పేజీ తరువాయి)

ఇటువంటి విందులను హాజరుకావడంలో ఔచిత్యమేదో బోధ పడదు.

* * * *

అభిమన్యుడు తిమ్మారెడ్డి

గతవారం శాసనసభలో శ్రీ సంజీవరెడ్డి చేసిన ఉపన్యాసం ఎంత గంభీరమైనదో, ఈ వారం వ్యవసాయశాఖామంత్రి శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ఉపన్యాసం అంత గంభీరమైనది, రోజుకి ఒక పూట తిండితినే చిన్న ఉద్యోగులుకూడా, 'ఆహారధాన్యాల ధరలు ఎంత తక్కువున్నాయ్!', అనిపించే ఉపన్యాసం అది.

శ్రీ తిమ్మారెడ్డికి కొన్ని నిశ్చితమైన అభిప్రాయా లున్నాయి. మీరు వారిని కలిసినా, వారు మిమ్మల్ని కలిసినా, సంభాషణ ఈ అభిప్రాయాల ప్రాతిపదికపై జరగవలసిందే. 'ఆహారధాన్యాల ఉత్పత్తి ధరలు పెరిగినప్పుడు, ఆహారధాన్యాల ధరలు పెరగకపోతే ఎలా?' అంటారు. శ్రీ తిమ్మారెడ్డి ఉద్దేశ్యంలో పల్లెల్లో ఉండే వారందరూ కష్టించేవారు. పట్టణాల్లో ఉండేవారంతా సుఖంగా బ్రతికేవారు.

వ్యవసాయశాఖామంత్రి వాదనలో లోపాలు లేకపోలేదు. రైతులు కష్టపడుతూన్నమాట వాస్తవమే. కాని ఆ కష్టాలు తొలగించవలసిన బాధ్యత ప్రభుత్వానిది. కష్టాలకు బాధ్యులు పట్టణవాసులు కాదు. వేసవికాలంలో అగ్నిమాపకదళాలు లేని కారణంగా పూరిగుడిసెలు తగలడిపోతే, అగ్నిమాపకదళాలను ఏర్పరచవలసింది ప్రభుత్వం. "పట్టణాల్లో మీ ఇళ్ళకు నిప్పంటుకుంటే ఒక గది కాలేసరికి ఫైరింజన్లు వచ్చేస్తాయ్" అనడం సత్యదూరమైన విషయం. పైగా—వచ్చినా, పల్లెల్లో పూరిగుడిసెలు అంటుకోడానికి కారణం అదికాదు.

నగరవాసులకు సౌకర్యాలున్నాయనే భ్రమ ఒకటి అధికారులకు ఉన్నట్టు కనిపిస్తోంది. కుంభకర్ణుడి అవతారంగా హైదరాబాదు నగర పురపాలకసంఘం కొన్ని సంవత్సరాలనుండి నిద్రపోతూంది. లక్షలకొలది రూపాయలు ప్రభుత్వం మంజూరుచేసినా అవి ఎటు మటుమాయమైపోతున్నాయో తెలపడం కష్టం. రాష్ట్రంలో మిగిలిన నగరాల పరిస్థితీ ఏమంత తృప్తికరంగాలేదు.

శ్రీ తిమ్మారెడ్డి వాదనలో లోపాలు లేకపోలేదు. కాని ఆయన అభిప్రాయాల పరిశుద్ధతను శంకించడం కష్టం. ముందొకమాటచెప్పి, వెనుక వేరొకమాటచెప్పే స్వభావానికి ఆయనకి చాలాదూరం. 302 సభ్యుల్లో మనస్సులో అభిప్రాయం బల్లగుద్ది చెప్పగల సభ్యుడి పేరు చెప్పమంటే—శ్రీ తిమ్మారెడ్డి పేరు పేర్కొంటాను నేను.

* * * *

శాసనసభలో జరిగిన చర్చ సందర్భంలో ఒక సభ్యుడు శ్రీ తిమ్మారెడ్డిని పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడితో పోల్చాడు. దానికి శ్రీ తిమ్మారెడ్డి సమాధానం: 'ఇప్పుడు జరిగే భారత యుద్ధంలో దుర్మార్గులంతా నశించిపోయే పరిస్థితుల్లో అభిమన్యుడనై సమసిపోడానికి అభ్యంతరం లేదు' అని!

'బారన్ యెస్టర్డే!'

మార్చి ఏడెనిమిది తేదీల్లో బొంబే నాట్యసంఘం అధ్వర్యాన ఒక ఉత్తమోత్తమమైన ప్రదర్శన ఎగ్జిబిషన్ థియేటర్‌లో ఏర్పాటు చేయబడింది. సినీతారలు దేవిద్, కామినీ కౌశల్ పాల్గొన్నారు. శ్రీ హెర్బర్ట్ మార్షల్ ప్రొడ్యూసర్.

ఏ మనిషినైనా ఏ వస్తువునైనా కొనెయ్యగలనన్న ధీమాతో ఢిల్లీ చేరతాడు ఒక వ్యాపారి. అతనితోపాటు అతని ప్రియురాలు 'బేబీ,' త్రాగుబోతు లాయర్ ప్రకాశ్ ఉంటారు. ఒక పార్లమెంటు మెంబర్ని కొనేస్తాడు వ్యాపారి. కాని తన 'బేబీ' తెలివి తక్కువతనం, అజ్ఞానం అడ్డొస్తూ ఉంటుంది క్షణక్షణానికి. ఆమె అజ్ఞానాన్ని రూపుమాపడానికి, ఆమెకి ఒక పత్రికా రచయిత సహకారంతో చదువుచెప్ప యత్నిస్తాడు. కాని ఆమె చదువు అతనికి సంబంధించినంతవరకు విషపరిణామాలకు దారితీస్తుంది.

ఒక అమెరికన్ నాటకాన్ని భారతీయ వాతావరణానికి అనువుగా మార్చి, ఖ్వాజా అహ్మద్ అబ్బాస్ వ్రాసిన నాటకం ఇది అబ్బాస్ కలంపదును ప్రతీ అక్షరంలోను ప్రతీ వాక్యంలోను కనపడుతుంది. రంగస్థలంపైన, తెరవెనుక పాత్రధారులందరూ అత్యద్భుతంగా నటించిన నాటకం ఇది.

★ ఏకారాలూ, మమకారాలూ ★

లోపం జరిగితే అంతటితో మీ వాళ్ళ దీక్షావిధి పరిపూర్తి అయ్యేటట్టుంది! ఆ తరువాత శుభకార్యానికి హాజరుకావడానికి మీవాళ్ళకెలాటి ఆక్షేపణా వుండబోదు" అన్నాను.

"ఐతే మనమూ వెళ్దామండీ!" అనునయంగా సాగదీసింది. మా ఆవిడ.

"వెళ్ళువెళ్ళు. పదిమందిలో తలెత్తుకుని తిరగడానికి మీ అమ్మకో క్రొత్తమేడయినా వుంది. నీకదీలేదు. వాళ్ళనీ, వీళ్లనీ అడిగి ఏడెనిమిది మంచి చీరలు ఎరువు తెచ్చుకో! ఎందుకైనా మంచిది. పొరుగింటి పంకజమ్మ నెక్లెసును యిప్పుడే 'బుక్' చేసివుంచు. కానీ ఓ హెచ్చరిక! ఇక్కడెలాగూ ఒకటి రెండు ట్రంకులు ఖాళీ అవుతాయి. వాటిల్లో నీ అభిమానాన్ని భద్రపరచి గట్టిగా తాళంవేసి మరీ వెళ్ళు లేకుంటే దాని కక్కడ చావుదెబ్బలు తగలొచ్చు" అన్నాను.

కానీ నా హెచ్చరికను వినడానికి ఇంకా మా ఆవిడ ఎక్కడుంది? తను పెళ్ళికి వెళ్ళబోతున్న శుభవార్తను పదిమంది చెవిలో వేసి రావడానికికాబోలు, ఎప్పుడో తుర్రుమనే తూనీగలా బయటికి జారిపోయింది.